క్లుప్తంగా

రక్తదాన శిబిరం



చేగుంటలో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కేజీఎస్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా విభాగ్ సంఘటన కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా మన దేశం మనధర్మం మనరక్తం పేరున రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార్యవాహ ప్రభాకర్, సురేష్, బీజేపీ మండలాధ్యక్షులు భూపాల్, గోవింద్‌తో పాటు నార్సింగి, చిన్న శంకరంపేట మండలాలకు చెందిన వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో శనివారం రైతు గర్జన సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చిందని ప్రశ్నించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగిన హరీశ్‌రావు నర్సాపూర్ నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమిలేదన్నారు. ఘనాపూర్ ఆనకట్టకు రూ. 100కోట్లు ఇస్తామని చెప్పి చిల్లిగవ్వ ఇవ్వలేదన్నారు. దళితబంధు, డబుల్‌బెడ్‌రూం ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మండలానికి రూ. 2కోట్లు కేటాయించిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్, శ్రీశైలం, అక్రం, బాలరాజ్, విఠల్‌గౌడ్, అనిల్, శ్రీకాంత్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేయాలి



మాట్లాడుతున్న మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ చేపట్టిన విధంగానే దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మైసయ్య, బాల ఎల్లం కోరారు. ఆదివారం నార్సింగి మండలం శేరిపల్లిలో వారు మాట్లాడుతూ.. తెలంగాణలో కుల గణనను స్వాగతిస్తున్నామన్నారు. ఇదే విధంగా దేశ వ్యాప్తంగా సర్వే చేయాలన్నారు. అలాగే జనాభా ప్రతిపాదికన కేంద్ర రిజర్వేషన్లను పెంచాలని కోరారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విద్యానిధి, అంబేడ్కర్ అభయాస్తం పథకం అమలు చేయాలని కోరారు. ఆయన వెంట మాలల హక్కుల సాధన సమితి నాయకులు రామస్వామి, రవి, నర్సింలు, నాగరాజ్, ప్రభాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైమాట్స్ లైట్లు ఏర్పాటు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయానికి ఆదివారం దాత విశ్రాంత ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి హైమాట్స్ లైట్లను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాములుగౌడ్, కమిటీ సభ్యులు ఎల్లాగౌడ్, వెంకట్‌రామాగౌడ్, కుమార్, అర్చకుడు ప్రభు తదితరులున్నారు.

ఉత్సాహంగా రెడ్డి సంఘం ఎన్నికలు

దుబ్బాక: పట్టణంలో పుర్మరెడ్డి సంఘం ఎన్నికలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. అధ్యక్షుడుగా కిష్టంగారి సుభాష్‌రెడ్డి తన సమీప అభ్యర్థి గుండెల్లి నరేశ్‌రెడ్డిపై 39ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడుగా పాతూరి అంజిరెడ్డి , ప్రధాన కార్యదర్శిగా ఎంగారి అనిల్‌రెడ్డి, కార్యదర్శిగా లక్కిరెడ్డి లింగారెడ్డి, కోశాధికారిగా గుడికందుల సందీప్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించారు.

సందేహాలుంటే నివృత్తి చేయండి

- తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి
- అధికారులకు దిశానిర్దేశం



పెద్దశంకరంపేట(మెదక్): కమలాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయి



మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ వివరాలను సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో సర్వే ప్రక్రియ పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): సదాశివపల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్



నర్సాపూర్ రూరల్: లింగాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ తారాసింగ్



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో..



టేక్మాల్(మెదక్): తంప్లూర్‌లో ..



శివ్వంపేట(నర్సాపూర్): దంతన్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలకు ఏవైనా సందేహాలుంటే తక్షణమే నివృత్తి చేయాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి అధికారులకు దిశానిర్దేశ చేశారు. సర్వేలో భాగంగా మాసాయిపేట మండల కేంద్రంలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియలు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందురోజే ఆయా కుటుంబాలకు సమాచారం ఇచ్చినట్లయితే సర్వే ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి సర్వే ప్రశాంతంగా కొనసాగుతుందని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నాలుగు గ్రామాల్లో సర్వే విషయమై ఎన్యుమరేటర్ల పనితీరును పరిశీలించామన్నారు. ప్రతీరోజు వారు చేయాల్సిన సర్వేలను, ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించామన్నారు. కుటుంబ సభ్యులు సర్వే చేయడానికి వచ్చిన ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు.

వివరాల సేకరణలో సమస్యలు

తూప్రాన్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు నమోదు చేయాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించే క్రమంలో వారి అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల విషయంలో ప్రజల నుంచి వివరాల సేకరణలో సమస్యలు తలెత్తుతునన్నాయని సిబ్బంది ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు.

పూర్తి వివరాలు నమోదు చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ గ్రేస్‌బాయి సూచించారు. మండల కేంద్రంతో పాటు కమలాపూర్ తదితర గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ప్రజలు సిబ్బందికి అవసరమైన పత్రాలు అందించి తమ పూర్తి వివరాలను సర్వేలో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీకాంత్, ఎంపీఓ విఠల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేయాలి

నర్సాపూర్ రూరల్: పకడ్బందీగా కుల గణన సర్వే చేయాలని నర్సాపూర్ ఎంఈఓ తారాసింగ్ సర్వే సిబ్బందికి సూచించారు. ఆదివారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

732 కుంటుంబాల సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం 732 కుటుంబాలను సర్వే చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కంచన్‌పల్లి, సదాశివపల్లిలో ఎంపీడీఓ, మహమ్మద్‌నగర్‌లో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీఓ కలీముల్లా పరిశీలించారు. వివిధ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు రెండో రోజు సర్వే ముమ్మరంగా వేగంగా నిర్వహించినట్లు చెప్పారు.

తంప్లూర్‌లో..

టేక్మాల్(మెదక్): మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే ఆదివారం ముమ్మరంగా సాగింది. మండలంలోని తంప్లూర్ గ్రామంలో సర్వేను మాజీ జెడ్పీటీసీ సర్వని సరోజ పరిశీలించారు. ఈ ఒక్కరు ప్రభుత్వం చేపడుతున్న సర్వేకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పోచయ్య, టీచర్లు తదితరులు ఉన్నారు.

సమగ్రంగా కుటుంబ సర్వే

మెదక్ మున్సిపాలిటీ: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పట్టణంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం 9వ వార్డులో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ఇంటి వివరాలను ఎన్యుమరేటర్ సేకరించారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ భవాని, యూడీఆర్‌ఐ జానయ్య తదితర నాయకుల ఇంటికి వెళ్లి ఎన్యుమరేటర్లు సర్వే చేశారు. ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం రూపొందించిన వివిధ వివరాలను చైర్మన్ ఎన్యుమరేటర్, మున్సిపల్ అధికారులకు వివరించారు. పట్టణ ప్రజలు సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సహకరించి వారి కుటుంబ వివరాలను అందించాలని మున్సిపల్ చైర్మన్ కోరారు.

దంతన్‌పల్లిలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్వేను తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తప్పులు లేకుండా సమగ్రంగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయండి



కౌడిపల్లి(నర్సాపూర్): మహమ్మద్‌నగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



పెద్దశంకరంపేట(మెదక్): కమలాపూర్‌లో ధాన్యం తేమను పరిశీలిస్తున్న ఏఈఓ

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు ఇబ్బందులు లేకుండా వరిధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. ఆదివారం మండలంలోని మహమ్మద్‌నగర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందొద్దని, సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలన్నారు. తేమశాతం పరిశీలించి పొల్లు, మట్టిపెడ్డలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తూకం వేసిన ధాన్యం ప్రతీరోజు రైస్ మిల్‌కు తరలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఏఈఓలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు వెంట వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందొద్దని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, వినీత్, అఖిల్‌హుస్సేన్, సీసీఎస్ సీఈఓ రవీందర్ పాల్గొన్నారు.

పది రోజులవుతున్నా.. ఆరుబయటే!

- తరలని ధాన్యం బస్తాలు
- కాపలా కాస్తున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

చేగుంట(తూప్రాన్): కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాలు పది రోజులుగా ఆరుబయటనే ఉన్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో పదిరోజుల క్రితం సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం తూకం వేశారు. దాదాపు 30 మంది రైతులకు సంబంధించి 2వేల ఐదువందల బస్తాల్లో ధాన్యం తూకం వేశారు. లారీలు కొరతగా ఉన్నాయనే సాకును చూపుతూ.. తూకం వేసిన ధాన్యాన్ని గ్రామంలోనే ఉంచారు. దీంతో ధాన్యం బస్తాలను రైతులు ప్రతీరోజు కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ధాన్యం తరళించే విషయంలో అధికారులు స్పందించకుంటే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటామని రైతులు పేర్కొంటున్నారు.



మక్కరాజీపేటలో తూకం వేసి వదిలేసిన ధాన్యం బస్తాలు

మూఢనమ్మకాల నిర్మూలన అందరి బాధ్యత



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న నరేశ్

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలనలో అందరికీ బాధ్యత ఉందని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్, ఏఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో ఆదివారం మండల పరిధిలోని గూడూర్‌లోని కస్తూర్బా బాలికల వసతిగృహంలో మహిళల రక్షణ, వ్యక్తిత్వ వికాసం-సైన్స్ మూఢనమ్మకాల నిర్మూలన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల అమాయకత్వాన్ని దొంగ స్వాములు, భూతవైద్యులు అసరాగా తీసుకొని ఆర్థికంగా సామాజికంగా ఎలా మోసం చేస్తున్నారనే విషయం గురించి సైన్స్ మ్యాజిక్ షో ద్వారా వివరించారు. బాల్య వివాహాలకు విద్యార్థినులు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకట్‌స్వామి, సిబ్బంది భానుచందర్, స్వరూప, తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



శివ్వంపేట(నర్సాపూర్): లక్ష్మీనర్సింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో కొలువైన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరు స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. దీంతో పాటు గుట్టపైన కొలువైన స్వామివారిని కాలినడకన వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఫోన్ అందజేత

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రానికి చెందిన ప్రభుదాస్ మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా.. పోలీస్‌లు నూతన టెక్నాలజీతో పట్టుకొని అతనికి అప్పగించారు. శుక్రవారం ప్రభుదాస్ మిర్జాపల్లి రోడ్‌లోని పాలకేంద్రం సమీపంలో మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా, సీఈఐఆర్ డాట్ పోర్టల్ ద్వారా పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు ఫోన్‌ను 24 గంటల్లోనే రికవరీ చేశారు. ఆదివారం ప్రభుదాస్‌కు నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ మొబైల్ ఫోన్‌ను అందించారు.

అందరి కృషితో పర్యావరణ పరిరక్షణ



న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్న శరత్‌చౌదరి

ములుగు(గజ్వేల్): గ్లోబల్ వార్మింగ్‌తో పర్యావరణం దెబ్బతింటోందని, కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని రక్షించడానికి అందరూ కృషి చేయాలని రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి పిలుపునిచ్చారు. మండల పరిధి తున్కిబొల్లారంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వైద్యనాథ్, గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి సాయిరెడ్డి, మాజీ అధ్యక్షులు కర్ణాకర్‌రెడ్డి, బాబుగౌడ్, చంటి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



శివ్వంపేట(నర్సాపూర్): సీతారం తండాలో బీఎల్‌ఓ వద్ద దరఖాస్తు చేస్తున్న కొత్త ఓటర్లు



చిలప్‌చెడ్‌లో నూతన ఓటరుగా దరఖాస్తులు చేసుకుంటున్న యువకులు



పెద్దశంకరంపేట(మెదక్): జూకల్‌లో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): 18 ఏళ్లు నిండిన యవతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ముసాద్దిక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలో ఏర్పాటు ఏర్పాటు చేసిన ఓటు నమోదు శిబిరంలో పలువురు యువతీ యువకులు నూతనంగా ఓటరుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముసాద్దిక్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌ల్లో కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చామన్నారు. అదేవిధంగా ఓటరుకార్డులో ఏవైనా సవరణలు ఉంటే బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు.

మృతి చెందిన వారి పేర్లు తొలగిస్తాం

శివ్వంపేట(నర్సాపూర్): 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులు ఓటుహక్కుల కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కమలాద్రి అన్నారు. ఓటుహక్కు నమోదు కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న 52 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు ఓటరు నమోదు చేపట్టారు. ఓటరు నమోదు పక్రియను తహసీల్దార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తప్పుల సవరణతో పాటు మృతి చెందిన వారి ఓటర్ల పేర్లు తొలగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కిషన్, బీఎల్‌ఓలు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీయువకుల నుంచి నూతన ఓటు హక్కు కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఆదివారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బీఎల్‌ఓలు దరఖాస్తులను స్వీకరించారు. ఆయా కేంద్రాలను తహసీల్దార్, ఆర్‌ఐలు పరిశీలించారు.

నమోదు కేంద్రం పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): ఓటరు నమోదు కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని మెదక్ ఆర్డీఓ రమాదేవి పరిశీలించారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన యువతి, యవకులు ఓటరు నమోదు కోసం దరఖాస్తులు అందించాలని ఆర్డీఓ కోరారు. ఓటరు జాబితాలో ఏదైన తప్పులు దొర్లినా, ఓటరు సవరణ చేయాలనుకున్న దరఖాస్తులు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు నాగరాణి, మాలతీలకు పలు సూచనలు చేశారు.

స్పెషల్‌డ్రైవ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బీఎల్‌ఓలు ఓటరు నమోదు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఓటు హక్కుకోసం 18 ఏళ్లు నిండిన వారితో పాటు 17ఏళ్లు ఉన్నవారికి సైతం ముందస్తు ఓటుహక్కును కల్పించేందుకు దరఖాస్తులు తీసుకున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. మహమ్మద్‌నగర్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజు

వెల్దుర్తి(తూప్రాన్): చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు అన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం వెల్దుర్తి పట్టణానికి చెందిన జీతయ్యగారి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు శనివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళం, బీరువా తాళాలు ధ్వంసం చేసి దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని రూ.25 వేలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇంటి పక్కనే నివాసముండే విజయ్‌కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరం అంగీకరించాడని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి అపహరణకు గురైన రూ.25 వేలు రికవరీ చేసి ఆదివారం కోర్టులో హాజరు పరుచగా, రిమాండ్ విధించారన్నారు.